తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ళ ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026

# అంతర రాష్ట్ర దొంగల అరెస్ట్

## - 18 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

సూళ్లూరుపేట, జూలై 25 ప్రభాతవార్త: ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల పరిధిలో వివిధ చైన్ స్నాచింగ్ కేసులతో సంబంధం ఉన్న ఇద్దరు అంతరరాష్ట్ర దొంగలను సూళ్లూరుపేట పోలీసులు వలపన్ని శుక్రవారం పట్టుకొని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 18 లక్షల రూపాయల విలువచేసే 96 గ్రాముల బంగారును, అలాగే చోరీకి గురైన కెటిఎమ్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.చెన్నైలోని కొరుక్కుపేటకు చెందిన కె. మోసెస్,మరియాదాస్ ఆనంద్ ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించి వీరిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శ్రీ చెంగాళమ్మ ఆలయ సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. మోసెస్ పై తమిళనాడులో 15 కేసులు, దొరవారి సత్రం, నాయుడుపేట, పెళ్లకూరులో 5 కేసులు ఉన్నట్లు తెలిపారు. అలాగే మరియదాసు ఆనంద్‌పై తమిళనాడులో 12 కేసులు సూళ్లూరుపేటలో ఐదు కేసులు నమోదు ఉన్నట్లు తెలిపారు. వీరిద్దరిపై ప్రస్తుతం సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్లో నాలుగు కేసులు నమోదై ఉన్నాయన్నారు. వీరు సూళ్లూరుపేటలో నవంబర్ 25న కరెంట్ ఆఫీస్ వద్ద, డిసెంబర్లో ఆర్యభట్ట నగర వద్ద, 2026 ఏప్రిల్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట, జూలై నెలలో శ్రీ వెంకటేశ్వర ఆలయ వీధిలో జరిగిన చైన్స్ స్నాచింగ్ కేసులతో వీరికి సంబంధం ఉన్నట్లు చెప్పారు. అలాగే తిరుపతిలో మే నెలలో కెటిఎమ్ బైక్‌ను చోరీ చేసినట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు ఆదేశాలతో ఈ కేసును చేదించడంలో సీఐ ఎం మురళీకృష్ణ, ఎస్సై గంట అజయ్ కుమార్ తన సిబ్బందితో కలిసి విశేషంగా కృషి చేసి అంతర్రాష్ట్ర దొంగలు పట్టుకున్నట్లు డి.ఎస్.పి చెంచు బాబు వెల్లడించారు. దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసులకు క్యాష్ రివార్డులను అందజేశారు.



అంతర రాష్ట్ర దొంగలను ఆరెస్టు చేసిన దృశ్యం

# చిత్తూరు మేయర్ కుర్చీ ఎవరికి!

## - జనరల్ కేటగిరికి రిజర్వ్ అయ్యే అవకాశం వుండటంతో తీవ్ర పోటీ
## - 50 డివిజన్ల నుండి 63 డివిజన్లకు పెరిగే అవకాశం!

చిత్తూరు, జులై 24 ప్రభాతవార్త: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం మొదట మున్సిపల్ ఎన్నికల నిర్వహణ చేపట్టాలని భావిస్తుండటంతో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవికి తీవ్ర పోటీ నెలకొంది. 2012లో స్పెషల్ గ్రేడ్ మున్సిపాల్టీ స్థాయి నుండి మున్సిపల్ కార్పొరేషన్‌గా చిత్తూరు అవతరించింది. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో 2014లో మొదటి సారి ఎన్నికలు నిర్వహించగా మేయర్ పదవి బిసీ మహిళకు రిజర్వ్ కావడంతో ఈ ఎన్నికల్లో మెజార్టీ డివిజన్లను తెలుగుదేశం పార్టీ గెలుపొందడంతో మేయర్‌గా కఠారి అనురాధ ఎన్నికయ్యారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు ఏడాది పాటు మేయర్‌గా కొనసాగిన కఠారి అనురాధ ఆపై హత్యకు గురి కావడంతో కొంతకాలం డిప్యుటీ మేయర్‌గా వున్న సుబ్రమణ్యం ఇన్‌ఛార్జీ మేయర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆపై 2015 సంవత్సరంలో దివంగత మేయర్ కఠారి అనురాధ కోడలు కఠారి అనురాధ మేయర్‌గా ఎన్నికై నాలుగేళ్ళ పాటు బాధ్యతలు నిర్వర్తించారు. ఆపై 2021 సంవత్సరంలో జరిగిన చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ పదవి ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ కావడం, మెజార్టీ డివిజన్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఖాతాలో పడటంతో ఎస్సీ మహిళ అయిన అముద మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం మళ్ళీ మున్సిపాల్టీలకు ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధం అవుతుండటంతో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి ఏ వర్గానికి రిజర్వ్ అవుతుందనే విషయంపై సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. ఈ సారి మేయర్ కుర్చీ రిజర్వేషన్ జనరల్ లేదా జనరల్ మహిళ, బీసీ జనరల్ అయ్యే అవకాశం వుంటుందని మేయర్ పదవి కోసం కన్ను వేసిన ఆశావాహులు ఎన్నికల్లో పోటీ చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీలో చేరి పార్టీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు విజయానికి సహకారం అందించిన మాజీ ఎమ్మెల్యే సికె బాబు తనయుడు సికె సాయికృష్ణారెడ్డిని మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయించి మేయర్ పదవికి ఎంపిక అయ్యేలా చేయడానికి సికె బాబు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అలాగే మరోవైపు గత అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తూరు నుండి తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేయడానికి తెలుగు దేశం నాయకులు సిఆర్ రాజన్, కఠారి హేమలత, కాజూరు బాలాజీ, చంద్రప్రకాష్‌లు పోటీ పడ్డారు. అయితే అనూహ్యంగా తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే అభ్యర్థిగా గురజాల జగన్మోహన్ నాయుడును ఎంపిక చేయడంతో ఆయన గెలుపు కోసం ఎన్నికల్లో అభ్యర్థిత్వం కోసం పోటీ పడిన నలుగురు శ్రమించారు. ఈ క్రమంలో సిఆర్ రాజన్‌తో పాటు కఠారి హేమ లతకు ప్రభుత్వం నామినేటెడ్ పదవులను కట్టబెట్టింది. ప్రస్తుతం మేయర్ పదవి కోసం తెలుగుదేశం సీనియర్ నాయకులు కాజూరు బాలాజీ తన వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ సారి ఎలాగైనా పార్టీ అధిష్టానం ఒప్పించి చిత్తూరు మేయర్ అభ్యర్థిగా పోటీ చేయడానికి ఆయన ఇప్పటికే నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నారు. మరోవైపు చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రస్తుతం 50 డివిజన్లు వుండగా ఈ సంఖ్యను 63కు పెంచుతూ మున్సిపల్ కార్పొరేషన్ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపింది. ఈ మేరకు దీనికి ఆమోదం లభిస్తే చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మరికొంత విస్తరించడంతో పాటు ప్రస్తుతం వున్న డివిజన్ల పరిధి కొంత మేరకు తారుమారు అయ్యే అవకాశం వుంది. మరోవైపు గత మున్సిపల్ ఎన్నికల్లో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 46 డివిజన్లలో విజయం సాధించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో సైతం అధికార తెలుగుదేశం పార్టీతో గట్టిగా తలపడటానికి సిద్ధం అవుతుంది. ఇప్పటికే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సై అంటున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రకటన విడుదలైతే చిత్తూరులో మరింత క్రియాశీలం కానుంది. మేయర్ రిజర్వేషన్ ఖరారు అయిన అనంతరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల వ్యూహంను ఖరారు చేసి అమలు చేయడానికి సిద్ధం అవుతుంది.




# గోవిందా... నీ కొండకు నీవే దిక్కు!

## -ఘాట్‌లో భద్రతపై వీడని అనుమానాలు

ప్రభాతవార్త ప్రతినిధి-తిరుమల: శేషాచలం కొండల మధ్యలో తిరుమలకు ఉన్న ప్రధాన ఘాట్‌రోడ్డు,కాలినడక మార్గాల్లో భద్రత ఏ పాటిదనేది భక్తుల్లో ఆందోళన కలిగిస్తోంది. చీమ చిటుక్కుమన్నా క్షణాల్లో కనిపెట్టే నిఘా నేత్రాల వ్యవస్థ ఉన్నా అడపాదడపా చిన్నచిన్న తప్పిదాలు,నేరాలు చోటుచేసుకొంటుండటం పరిపాటిగా మారింది. ఏదేని ఘటన జరిగిన తరువాత పోలీసులకు, టిటిడి విజిలెన్స్ సిబ్బందికి సమాచారం అందితే ఆ తరువాత గాలింపు చర్యలు, దర్యాప్తు అంటూ హడావిడి చేయడం పరిపాటిగా మారింది. ముందస్తుగా టిటిడి భద్రత వ్యవస్థ పనితీరు ఏపాటిదనేది భేరీజు వేసుకున్నా లక్షీమని భక్తులు కూడా తీసిపారేస్తుండటం విశేషం. తరచూ ఘాట్‌రోడ్లలో, కాలినడక మార్గాల్లో చిరుతలు, ఎలుగుబంట్లు సంచారంతో బెంబేలెత్తిపోతున్న భక్తులకు పూర్తి స్థాయిలో భద్రత కల్పించడమనేది టిటిడి భద్రతవ్యవస్థకు తలకుమించిన భారంగానే మారింది. ఇందుకు తాజా నిదర్శనంగా బుధవారం తెల్లవారు జామున తిరుమల మొదటిఘాట్‌లో ఏడవమైలు వద్ద ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం క్రిందిభాగంలో ఒక అడుగు ఆంజనేయస్వామి రాతివిగ్రహం చోరీ జరగడంతో భద్రతా లోపం మరోసారి ప్రస్ఫుటమైంది. భక్తుల సంచారంగానీ, ఘాట్‌రోడ్డుపై వాహనాల కదలికలు గానీ లేని సమయంలో తెల్లవారుజామున 2.30గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి గోవిందమాల ధరించిన ముసుగులో ఓ టవల్‌లో ఆంజనేయస్వామి విగ్రహాన్ని పెట్టుకుని తీసుకెళుతున్నట్లు సిసి కెమెరా పుటేజీల్లో చిత్రీకరించబడింది. ఈ సంఘటన ఉదయం 6గంటల సమయంలో భక్తులు అక్కడ పూజలు చేయడానికి వచ్చి విగ్రహం లేకుండా కేవలం పీఠంమాత్రమే ఉండటంతో అనుమానంతో భద్రత సిబ్బందికి ఫిర్యాదు చేయడం సంచలనం కలిగించింది. అర్ధరాత్రి దాటిన తరువాత ఈ చోరీ జరగడం మాత్రం భద్రత లోపాలను ఎత్తిచూపింది. 24గంటలూ తిరుమలలోని కమాండ్ కంట్రోల్ కేంద్రం నుండి నిఘా ఉంచే భద్రత సిబ్బంది భక్తుల కదలికలు లేని సమయంలో నడకమార్గంలో, ఘాట్‌రోడ్డుపై ఎందుకు పర్యవేక్షణ లేకపోయిందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. దేవుడి దయతో అంతా సవ్యంగా సాగిపోతే భద్రత భేష్‌అని డప్పు కొట్టుకోవడంలో టిటిడి విజిలెన్స్ ముందుంటుంది. అయితే అసలు విధులు కంటే ప్రోటోకాల్ విధులకే విజిలెన్స్ అదికారులు ప్రాధాన్యత నిస్తుండటంతో ఇలాంటి పొరబాట్లు జరుగుతున్నాయనే విమర్శలు భక్తుల నుండి వ్యక్తమవుతున్నాయి. మొదటి ఘాట్‌లో సిసిటీవీలో రికార్డ్ అయిన దృశ్యాలతో భద్రత సిబ్బంది హడలిపోయారు.హనుమాన్ చిన్న విగ్రహ: గుర్తు తెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. హనుమంతుడి విగ్రహాన్ని పెకలించి చోరీ చేసినట్లుగా భావించారు. ఇంత జరుగుతున్నా నిఘానేత్రాలతో ఎందుకు కనిపెట్టలేక పోయారనేది భక్తుల్లో ప్రధాన ప్రశ్నలు. వేకువ జామున 3 గంటల సమయంలో జరిగినా కనుక్కోలేక పోవడం మాత్రం భద్రతా వైఫల్యంగానే భావిస్తున్నారు. ఆంజనేయ స్వామి విగ్రహం మాయమైనా గుర్తించలేక పోవడం విచారకరం.ఇదిలా ఉండగా తిరుమలలో భద్రతా వైఫల్యాలకు సంబంధించి గతంలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లడం, నిషిద్ధ వాహనాలు ప్రవేశించడం వంటి ఘటనలు కూడా చోటు చేసు కున్నాయి. ఏకంగా కొందరు భక్తులు మొబైల్ ఫోన్లు తీసుకువెళ్లి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోకి వీడియోలు తీసి సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేయడం కలకలం రేపింది.వైకుంఠమ్‌లో స్కానింగ్ పాయింట్ల వద్ద తనిఖీలను దాటుకుని సెల్‌ఫోన్లు లోపలికి వెళ్లడంపై భక్తుల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. గతంలోనూ తిరుమల మాడ వీధుల్లోకి అనధికారిక వాహనాలు ప్రవేశించడంపై భద్రతా వైఫల్యంపై పెద్ద దుమారం రేపింది.



# హంస వాహనంపై ... సవ్యసాచి



శ్రీకాళహస్తి,జూలై 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పట్టణంలో సవ్యసాచి హంస వాహనంపై భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు. బ్రహ్మోత్సవాల్లో చివరి మూడు రోజుల ఉత్సవాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆలయం నుంచి అర్జునుని ఊరేగింపుకు సిద్ధం చేశారు. ఊరేగింపు ఆలయం నుంచి బయలుదేరి జయరామారావువీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధుల మీదుగా సాగింది. ఉత్సవంతో పాటు పూజారి పురుషోత్తం, ఉత్సవాల ఇన్‌చార్జిలు సుబ్రమణ్యం, దుర్గా ప్రసాద్‌లు వెంట వచ్చారు.ఈ ఏడాది ఉత్సవాల్లో ఇఓ బికె వవెంకటేశులు ఆదేశాల మేరకు లక్ష్మయ్య ముందుగానే సమయ పాలనకు సంబంధించి ఆదేశించారు. ఉత్సవాలను ప్రత్యేకంగా ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్ పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం ఆయన సవ్యసాచికి పూజలు నిర్వహించి ఊరేగింపుకు సాగనంపారు. అంతేకాక అలంకారానికి సంబంధించి పూల సరఫరా చేసే కాంట్రాక్టర్లకు కూడా సూచనలిచ్చారు. దాంతో ప్రతి రోజూ ఉత్సవం సమయపాలనతో వస్తుండటంతో భక్తులే కాకుండా స్థానికులు దూరప్రాంతాల నుంచి వచ్చే శివభక్తులు కూడా దర్శించుకుంటున్నారు.చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, దఫేదార్‌లు ప్రతి ఉత్సవానికి ముందుండి సాగిస్తున్నారు.

## మోటరైజ్డ్ త్రీ వీలర్ స్కూటీల పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్

# దివ్యాంగులకు...సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం

తిరుపతి కలెక్టరేట్ జూలై 24 ప్రభాతవార్త: దివ్యాంగుల ఆర్థిక స్వావలంబన, సామాజిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ నందు నిర్వహించిన విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలకు 70 మూడు చక్రాల వాహనాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోవింద రావు, తిరుపతి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు అరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఏపీ స్టేట్ డిసేబుల్డ్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నారాయణ స్వామి, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదా శివం, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి వినోద్, ప్రజాప్రతి నిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన 70 మంది అర్హులైన దివ్యాంగ లబ్ధిదారులకు మోటరైజ్డ్ త్రీ వీలర్ స్కూటీలను పంపిణీ చేశామన్నారు. చదువుకున్న వారు, ఉద్యోగులు, స్వయం ఉపాధి చేపట్టాలనుకునే వారికి మెరిట్ ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. అవసరమైన ఇతర అర్హులను గుర్తించి తదుపరి విడతలో కూడా వాహనాలు అందజేస్తామని వెల్లడించారు. దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దివ్యాంగులు కూడా ఇతరుల మాదిరిగానే విద్య, ఉపాధి, వ్యాపార రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటు అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ స్వామి మాట్లాడుతూ దివ్యాంగుల జీవన ప్రమాణాలు మెరుగుపరచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో దివ్యాంగుల సంక్షేమం, ఉపాధి, భద్రత, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా వివిధ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ, ప్రభుత్వం అందించిన త్రీ వీలర్ స్కూటీలతో స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, ఇతరులపై ఆధారపడకుండా జీవనోపాధి పొందేందుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, దివ్యాంగ సంక్షేమ శాఖ అధికారులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




స్కూటీలు పంపిణీ చేస్తున్న దృశ్యం

# ఈ ఏడాది...స్కిట్‌లోనే తరగతులు

## -మంత్రి వర్గంసమావేశంలో తీర్మానం -ఫలించిన ఎంఎల్ఏ దౌత్యం

శ్రీకాళహస్తి,జూలై 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో నిర్వహిస్తూ మూతబడ్డ ఇంజనీరింగ్ కళాశాలను తెరిపించుటకు కూటమి నాయకులు ఇచ్చిన హామీ అమలుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. లోకేష్ మూడేళ్ళ క్రితం నిర్వహించిన యువగళం పాదయాత్ర సందర్భంగా శ్రీకాళహస్తి ప్రజలకు ఇచ్చిన హామీల్లో స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను తెరిపిస్తామని ఇచ్చిన హామీ అమలు చేసారు. గత మంత్రి వర్గ సమావేశంలోనే నిర్ణయం తీసుకొని ఉండాల్సింది. అయితే ఆ సమావేశంలో నారాలోకేష్ లేనందువల్ల సాధ్యం కాలేదు. ముందుగానే ఈ నిర్ణయం తీసుకొని ఉండి ఉంటే ఇంకా ప్రయోజకరంగా ఉండేది. ఎట్టకేలకు ఈ ఏడాది స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల శ్రీకాళహస్తిలోనే నిర్వహించుటకు జేయన్‌టియు అనంతపురం అధికారులు సన్నాహాలు చేపట్టారు.రూ.20కోట్లు నిధులు కేటాయించారు యువగళం పాదయాత్ర సందర్భంగా కళ్యాశాల తెరిపించుటకు హామీ ఇచ్చిన నారాలోకేష్ ఉన్నత విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి రెండేళ్ళ పాటు పట్టుదలగా పలుమార్లు కలిసి అభ్యర్థించారు. గత ఏడాది ఈ కళాశాలను అనంతపురంలోని జేయన్‌టి యుకు అప్పగించుటకు నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వమే రూ.120కోట్లు నిధులు భరించుటకు కూడా లోకేష్ నిర్ణయించారు. కానీ నిబంధనల ఉచ్చులో చాలా ఆలస్యం జరిగింది. గత ఏడాది చేరిన 38మంది విద్యార్థులు కలికిరికి వెళ్ళక తప్పలేదు. అయితే ఈ ఏడాది ఎలాగైనా కళాశాలను ఇక్కడే నిర్వహించుటకు నిర్ణయించారు. ఈ నెల 1న శ్రీకాళహస్తి పర్యటనకు వచ్చిన లోకేష్ ఎంఎల్ఏ స్వగృహానికి రాగా అక్కడ స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలకు సంబంధించి జేయన్‌టియు అనంతపురం కు చెందిన వైస్‌ఛాన్సలర్ సుదర్శనంతో ఎంఎల్ఏ సమావేశం ఏర్పాటు చేసారు. ఇక్కడ నెలకొన్న ప్రతిష్టంభనను లోకేష్‌కు వివరించారు. మంత్రి వర్గ సమావేశంలో తీర్మానం చేస్తామనిలోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చారు. ఈ ఏమేరకు గురువారం జరిగిన మంత్రి వర్గ సమావేశంలో స్కిట్ కళాశాలను తెరిపించుటకు పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో వివాదాస్పందంగా మారిన లీజు అగ్రిమెంట్‌కు సంబంధించిన రూ.3.2కోట్లు ప్రభుత్వం భరించుటకు నిర్ణయం తీసుకున్నారు.ఈ కళాశాలను 11 సంవత్సరాలు లీజుకు అంగీకరించారు.



శ్రీకాళహస్తిలోని స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల దృశ్యం

### -రూ.21 కోట్లతో అభివృద్ధి పనులు: విసి

శ్రీకాళహస్తీశ్వరస్వామి ఇంజనీరింగ్ కళాశాల స్వాధీనానికి సంబంధించి బాలారిష్టాలు అన్ని తొలగినాయని ఈ కళాశాల అభివృద్ధికి రూ.21కోట్లతో ఇప్పటికే టెండర్లు పిలిచి సిద్ధంగా ఉన్నాయని వాటిని వెంటనే అమలు చేసి ఈ ఏడాది నుంచి తరగతులను శ్రీకాళహస్తిలోనే నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామని వైస్‌చాన్సలర్ సుదర్శనం శుక్రవారం ప్రభాతవార్తకు వివరించారు. కళాశాలలో ఫర్నిచర్ అభివృద్ధికి రూ.10కోట్లు కేటాయించినట్లు వివరించారు. కాగా కొత్త ఎక్యుప్‌మెంట్స్ కొనుగోలుకు ల్యాబ్‌లో అవసరమైన పరికరాలు కొనుగోలుకు మరో రూ.11 కోట్లు కేటాయించినట్లు ఆయన వివరించారు. సాధ్యమైనంత వరకు ఈ ఏడాది శ్రీకాళహస్తిలోనే తరగతులు నిర్వహించుటకు ప్రయత్నిస్తున్నట్లు వైస్ చాన్సలర్ వివరించారు.

## జిల్లా వ్యాప్తంగా వాహనాలు...

# పార్సల్ కార్యాలయాలు విస్తృత తనిఖీ

## - గ్రామాల్లో ప్రజలతో ముఖాముఖి సమావేశాలు - గంజాయి, సైబర్ నేరాలు, రహదారి భద్రతపై అవగాహన



తిరుపతి క్రైమ్, జూలై 24 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఒకవైపు విజిబుల్ పోలీసింగ్‌ను ముమ్మరం చేస్తూనే, మరోవైపు ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రధాన కూడళ్లు, పార్సిల్ కార్యాలయాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి నేరాల నివారణకు కృషి చేశారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా బిఎన్ కండ్రిగ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఎస్ఐతో కలిసి కల్లిపూడి గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులతో సమావేశమయ్యారు. వారి స్థానిక సమస్యలను తెలుసుకొని, గంజాయి నిర్మూలన, రహదారి భద్రతా నిబంధనలు, సైబర్ మోసాల నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలనే అంశాలపై అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ కార్యకలాపాల సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అలిపిరి సీఐ రామకిషోర్ పార్సిల్ వాహనాలు తనిఖీలు చేపట్టారు. అలాగే పెనగలూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ సందర్భంగా పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. తిరుపతి మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, ఐపీఎస్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని పేర్కొన్నారు. గంజాయి, సైబర్ నేరాలు, మహిళలు మరియు చిన్నారులపై నేరాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలపై సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్ 112కు సమాచారం అందించాలని, ప్రజల భద్రత కోసం ఇటువంటి అవగాహన కార్యక్రమాలు మరియు తనిఖీలు జిల్లా వ్యాప్తంగా నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

## విద్యార్థి ప్రగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అత్యంత కీలకం : జిల్లా కలెక్టర్

# మెగా పీటీఎంతో...విద్యా నాణ్యత మెరుగు

తిరుపతి విద్య, జూలై 24 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యాస స్థాయిని మెరుగుపర్చడంతో పాటు తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్ (పీటీఎం) 4.0 కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా విశేష స్పందన లభించింది. తిరుపతిలోని శ్రీ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, క్లీన్ అండ్ గ్రీన్ బ్యూటిఫికేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ శారదాదేవి, డీఈఓ కె.వి.ఎన్. కుమార్ పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ, విద్యార్థి ప్రగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. మెగా పీటీఎంల ద్వారా విద్యార్థుల అభ్యాస పురోగతిని తల్లిదండ్రులు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కలుగుతోందని చెప్పారు. జిల్లాలోని 2,550 పాఠశాలల్లో సుమారు 1.52 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు వెల్లడించారు. లీప్ యాప్, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమాల తో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని వివరించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు రూ.50 వేలు, క్లీన్ అండ్ గ్రీన్ బ్యూటిఫికేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ రూ.50 వేలు, విద్యాశాఖ తరపున డీఈఓ రూ.20 వేలు విరాళంగా ప్రకటించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ, పిల్లలపై ఒత్తిడి కాకుండా వారి ఆసక్తులు, ప్రతిభకు అనుగుణంగా ప్రోత్సహిస్తే మెరుగైన ఫలితాలు సాధిస్తారని అన్నారు. మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా పాఠశాలకు మినరల్ వాటర్ ప్లాంట్‌ను అందజేస్తామని ప్రకటించారు. డీఈఓ కె.వి.ఎన్. కుమార్ మాట్లాడుతూ, మెగా పీటీఎంల ద్వారా ప్రతి విద్యార్థి ప్రోగ్రెస్ కార్డును తల్లిదండ్రులకు వివరించి, మెరుగుపరచాల్సిన అంశాలపై ప్రత్యేక సూచనలు అందిస్తున్నామని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.




విద్యార్థ తల్లిదండ్రుల సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్

25 CTR 6:25 CTR 6.qxd 7/24/2026 11:16 PM Page 1



## ఘనంగామహా కుంభాభిషేక మహోత్సవం



శ్రీకాళహస్తి రూరల్, జూలై 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం టిపిఎంవి కండ్రిగ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయ కుంబాబిషేకం కార్యక్రమాలు భక్తి శ్రద్దలతో ప్రారంభమయ్యాయి. గ్రామంలో పొన్నాలమ్మ పరమేశ్వరి ఆలయం నిర్మించారు. మహ కుంభాభిషేక మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడగా, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పుణ్యాహవాచనం, గణపతి పూజ, కలశ స్థాపన, హోమాలు, ప్రత్యేక అభిషేకాలు వైభవంగా జరిగాయి. ఈ మహోత్సవానికి పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ, తీర్థ ప్రసాదాల పంపిణీ చేపట్టారు. మహా కుంభాభిషేక మహోత్సవం విజయవంతంగా ముగియడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్‌రెడ్డి సోయిండి, శంకర్ రెడ్డి, రెడ్డివారి మోహన్, మన్నసముద్రం. పురుషోత్తం, కృష్ణాపురం, రమేష్, ఎస్.నాదమునిరెడ్డి, హరినాద్ రెడ్డి, మోహన్, ఎం గుర్రప్ప, మునెయ్య, హరిబాబు బాలాజీ, శేఖర్, టి.శేఖర్ పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



శ్రీకాళహస్తి జూలై 24 ప్రభాతవార్త: ప్రతి ఏడాది నిర్వహించే ద్రౌపది సమేత ధర్మరాజుల బ్రహ్మోత్సవాలలో రాబోవు రెండు రోజుల్లో అగ్నిగుండం సందర్భంగా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కాళహస్తి డి.ఎస్.పి నరసింహమూర్తి అన్నారు. శుక్రవారం ఆలయ పరిసరాల్లో పోలీస్ సిబ్బంది, టెంపుల్ సెక్యూరిటీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని బందోబస్తు ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని సూచించారు. ఆలయంలోకి వచ్చే భక్తులకు క్యూ లైన్ల వద్ద సరైన ఏర్పాట్లు చేయాలని, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచాలి భక్తులకు త్రాగునీరు, ఇతర సౌకర్యాలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్టౌన్ సిఐ వెంకటేశ్వర్లు, టూ టౌన్ సీఐ నాగార్జున, రూరల్ సీఐ ఇబ్రహీం తోట్టెంబేడు ఎస్సై బి. బాలకృష్ణ లు పాల్గొన్నారు. ఈ మేరకు ఆలయ సూపరింటెండెంట్ రవి ఆలయ సిబ్బందికి సూచనలు చేసారు.

## ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తాం: రావిళ్ళ



తొట్టంబేడు, జూలై 24 ప్రభాతవార్త: విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో అవసరమని తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షులు రావెళ్ల మునిరాజా నాయుడు అన్నారు. శుక్రవారం గురుకుల పాలెం మోడల్ ప్రైమరీ పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్ తో గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమన్నారు. పిల్లల్లో నైతిక విలువలతో పాటు చదువు కూడా అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ప్యానెల్ పార్థసారథి, భూత్ ఇన్చార్జ్ భాను ప్రకాష్, యూనిట్ కోకన్వీనర్ బత్తుల విజయ్ కుమార్, గ్రామ పెద్దలు గోవర్ధన్ నాయుడు, రాటకొండ విజయ్ కుమార్‌నాయుడుతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సచివాలయ సిబ్బంది పెద్ద ఎత్తునపాల్గొన్నారు. సమావేశంచివర్లోపాఠశాల అభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని తీర్మానించారు.

## ఏర్పేడులో మెగా పేరెంట్స్ డే

ఏర్పేడు, జూలై 24 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం బండారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్స్ డే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజు, వేలు ,విద్యా కమిటీ చైర్మన్ చెంచు రెడ్డి, వైస్ చైర్మన్ శారద , గ్రామ మాజీ సర్పంచ్ శివశంకర్ రెడ్డి, పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యం యాదవ్, భక్తిరెడ్డి, రాజా ,వెంకటేష్, మురళి ,సుబ్బారెడ్డి పాటు ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు

## విద్యార్థి సంఘాల బంద్ విజయవంతం



శ్రీకాళహస్తి, రూరల్, తొట్టంబేడు, జూలై 24 ప్రభాతవార్త : నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనను ఖండిస్తూ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్యు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం విద్యాసంస్థల బంద్ విజయవంతంగా జరిగింది. ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు మాట్లాడుతూ, పేపర్ లీక్ దేశంలోని లక్షలాది విద్యార్థుల భవిష్యత్తుతో చేసిన మోసమని అన్నారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఒక విద్యార్థి పగలు రాత్రి కష్టపడతాడు. తల్లిదండ్రులు అప్పులు చేసి కోచింగ్ లకు పంపుతారు. అలాంటి కష్టాన్ని ఒక పేపర్ లీక్‌తో నీరుగార్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, ఎస్ఎఫ్ఐ నాయకులు గురవయ్య, పిడిఎస్యు నాయకులు ముజీబ్(చోటు)తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో మెలగాలి...గురువులను గౌరవించాలి



ఏర్పేడు జూలై 24 ప్రభాతవార్త: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, గురువులను గౌరవించాలని తాముచదివే పాఠశాలను దేవాలయంగా భావించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఏర్పేడు మండలం పాపా నాయుడు పేట ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, గురువులను, తల్లిదండ్రులను గౌరవించాలని సూచించారు. తమ పాఠశాలకు, తమ గ్రామానికి మంచి పేరు వచ్చేలా చదవాలని, మంచిగా నడుచుకోవాలని ఉపదేశించారు. అనంతరం ఆయన పాఠశాలలోని టాయిలెట్స్, క్లాస్ రూమ్స్ ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కూర్చొని మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు, సీనియర్ నాయకులు పేరం ధనంజయులు నాయుడు, శివశంకర్ రెడ్డి, సూరి నాయుడు, బాబు నాయుడు, మోహన్ నాయుడు, గిరి నాయుడు, క్రిష్ణప్ప మొదలియార్ తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్కావెంజర్స్‌కు జడ్‌పిటిసి రూ.10వేలు వితరణ



శ్రీకాళహస్తి, జూలై 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని కొత్తపేటలో గల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం పిటిఎం 4.0 స్కూల్ ప్లస్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సభకు ప్రధానోపాధ్యాయురాలు కే.సుచరిత అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిధులుగా జడ్‌పిటిసి సుబ్బారెడ్డి, పట్టణ పార్టీ కార్యదర్శి కాసరం రమేష్, మాజీ వైస్‌చైర్మెన్ మిన్నల్ రవిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి కే.వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం బడుల అభివృద్ధి పేరుతో నిధులు బోజనం చేసారన్నారు. నేడు అలాంటి పరిస్థితి లేదన్నారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహణ బాగుందన్నారు. ఇక్కడ టాయిలెట్స్ మెంటైనెన్స్ బాగుందని అభినందిస్తూ స్కావెంజర్ నలుగురికి కలిసి రూ.10వేలు వ్యక్తిగత సహాయం అందించారు. ఈ సమావేశంలో వన్‌టౌన్ ఎస్ఐ పాల్గొన్నారు.

## వీరభద్రస్వామి ఆలయంలో....తొలి ఏకాదశి పూజలు



తొట్టంబేడు, జూలై 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న మండలంలోని చిన్న సింగమాలలో వెలసిన వీరభద్రస్వామి ఆలయంలో తొలిఏకాదశి పూజలను శుక్రవారం కన్నులపండువగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఈ ఆలయంలో నిర్వహించే కార్యక్రమాలకు చుట్టుపక్కల సుమారు 15 గ్రామాల నుంచి భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. నాయుడుపేట తిరుపతి జాతీయ రహదారి పక్కనవెలసిన వీరభద్రస్వామి ఆలయం మహిమాన్వితమైనది శుక్రవారం ఉదయం తొలిఏకాదశి పూజల సందర్భంగా స్వామికి సహస్రఘట్టాబిషేకంను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని స్వామి అభిషేకాలను తిలకించారు. తరువాత విశేష అలంకారం నిర్వహించారు. తరువాత తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అన్నదానం జరిపారు. ఉదయం నుంచి ఆలయంలో ధార్మిక కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాత్రి అంగరంగ వైభవంగా నందిసేవ జరిపారు. ఈ సందర్భంగా గ్రామోత్సవంను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వారి సహాచరులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనాలు పొందారు.

## చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాలలో...

**తిరుపతి విద్య, జూలై 24 ప్రభాతవార్త:** రేణిగుంట రోడ్డు లో ఉన్న చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 28న మెగా పూల్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల యాజమాన్యం వెల్లడించింది. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో జూలై 28వ తేదీ మంగళవారం ఉదయం కళాశాల ప్రాంగణంలో ఈ నియామక కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ మెగా రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా ఐటీ, కోర్ ఇంజినీరింగ్, తయారీ, బ్యాంకింగ్, డిఫెన్స్, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, కస్టమర్ సపోర్ట్ తదితర రంగాల్లో 500కు పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉండనున్నాయి. ప్రముఖ సంస్థలు పాల్గొని అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. డిగ్రీ, ఫార్మసీ, బీటెక్ అన్ని విభాగాలు, ఎంబీఏ, ఎంసీఏ, డిప్లొమా, పాలిటెక్నిక్ విద్యార్థులతో పాటు 2024-25, 2025-26 విద్యా సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నియామక డ్రైవ్‌కు అర్హులని నిర్వాహకులు తెలిపారు. ఈ మెగా పూల్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, శిక్షణ-ఉద్యోగ నియామక విభాగం ప్రతినిధులు కోరారు.

## తోతాపురి సాగు వివరాల నివేదికలు అందించాలి

శాంతిపురం, జూలై 24 ప్రభాతవార్త: తోతాపురి సాగు చేసిన రైతుల వివరాలు నివేదికల రూపంలో అందించాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి సతీష్ ఆదేశించారు. శుక్రవారం శాంతిపురం మండల కార్యాలయంలో నియోజకవర్గం లోని ఆర్ఎస్‌కెల సిబ్బంది, విఆర్వోలకు తోతాపురి మామిడి సాగు రైతులకు సబ్సిడీ మంజూరుకు అనుసరించాల్సిన విధివిధానాలు, నియమాలపై శిక్షణ కార్యక్రమంను డిహెచ్‌ఒ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేరు నమోదైన రైతులు మామిడి పంట సాగు చేశారా, తోతాపురి విస్తీర్ణం ఎంత, పంట నమోదు జరిగిందా, పంట దిగుబడి ఏమేర అనే అంశాలపై నివేదికలు అందించాలన్నారు. తుది జాబితా విడుదలకు ముందే గ్రామసభ నిర్వహించి అభ్యంతరాలు స్వీకరించాలని సూచించారు. సమావేశంలో ఎడి పల్లవి, ఉద్యానవన అధికారులు డింపుప్రియ, వింధ్య, ఆర్ఎస్‌కె సిబ్బంది, విఆర్వోలు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించటం నేరం



తొట్టంబేడు, జూలై 24 ప్రభాతవార్త: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించటం నేరమని తొట్టంబేడు ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. శుక్రవారం నెల్లిమాన్‌కండ్రిగ సమీపంలో చెట్టుకింద మద్యం సేవిస్తున్న 8 మందిని అదుపులో తీసుకొని వారిని చైతన్యపరచారు. ఓపెన్‌బూజింగ్ కేసును నమోదు చేసినట్లు వివరించారు. నెల్లిమాను కండ్రిగ గ్రామ సమీపంలో కొందరు బాలురు చేద బావివద్ద నీటితో మునగటానికి వెళ్ళి ఉండటం గనించిన మైనర్ బాలురును చైతన్యపరుస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని నీటిలో మునిగే ప్రమాదం ఉందని వారిని చైతన్య పరచారు. కాగా అక్కడే ఒక్కోస్కూటి మీద నలుగురు వెళుతుండటంతో వారిని పట్టుకొని మరోసారి ఇలా వెళితే కేసు నమోదు చేస్తామంటూ హెచ్చరించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని సూచించారు.

## సంప్రదాయాలను కాపాడుకోవాలి: రేహాన్

**శ్రీకాళహస్తి, జూలై 24 ప్రభాతవార్త:** ప్రపంచ దేశాల్లో అత్యధిక జనాభా కల్గిన ముస్లింలు తమ ఆచార వ్యవహారాలతో పాటు మనకు మార్గదర్శకమైన మహమ్మద్ ప్రవక్త ఆచరించిన సంప్రదాయాలను ఆచరించి, అల్లాహ్‌కు ప్రీతిపాత్రులు కావాలని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ పిలుపు నిచ్చారు. శుక్రవారం జామియా మస్జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు మనం సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను దివ్యఖుర్‌ఆన్ దేశాల మేరకు కాకుండా మన సొంత అజెండాగా మార్చుకుంటున్నామన్నారు. మసిదులకు టోపి లేకుండా రావటం గమనిస్తే మన సంప్రదాయాల మీద ఎంత గౌరవం ఉందో తెలుస్తుందన్నారు. ఇది మన ప్రవక్త మహమ్మద్ ఆచరించిన విధానాలకు వ్యతిరేక మన్నారు. ఇక మనం ఆచరించే నమాజులు, అందులో పఠించేసూరాలు ప్రార్థించేవిగా ఉండాలి తప్ప పాపాలను కూడగట్టుకునేవిగా ఉండకూడదన్నారు. అందుకు ప్రతి ఒక్కరు గురువును ఆశ్రయించి మనం చదివే సూరాలను సరిదిద్దుకోవాలన్నారు. మనల్ని సృష్టించిన అల్లాహ్‌కు ఎల్లవేళల్లో నమాజుల్లో ధన్యవాదాలు తెలుపుతూ ఆరాధించాలన్నారు. నమాజును తప్పని సరిగా ఆచరిస్తూ అల్లాహ్‌కు దగ్గర కావాలని సూచించారు.



## భక్తి శ్రద్దలతో వారాహి అమ్మవారి పూజలు



శ్రీకాళహస్తి, జూలై 24 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు ముగిసాయి. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ముత్యాలమ్మగుడిలోనూ, అలాగే బిపి అగ్రహారంలోని ఆలయంలో భారీ ఎత్తున పూజలు, అలంకారాలు నిర్వహించారు. అమ్మవారికి నవరాత్రి మహోత్సవాలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో గురువారం అర్థరాత్రి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అలంకారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రహారం ఆలయంలో పానగల్ పరిసరాలకు చెందిన మహిళా భక్తులు ముత్యాలమ్మగుడిలో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన మహిళ భక్తులు కదలి వచ్చారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మగుడిలో పూజారి బండారు పరమేశ్వర్ సారధ్యంలో అమ్మవారిని కన్నులు మిరుమిట్లు గోల్పునట్లు అలంకారాలుజరిపారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలను సుగంధ ద్రవ్యాలతో నిర్వహించారు. పూజలకు హాజరైన మహిళలకు సారెగా పసుపు, కుంకుమ దారాలు, గాజులు, పూలు, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమాలకు ముత్యాలమ్మగుడి మాజీ చైర్మెన్ బూడిదవాకం రేణుకమ్మ, తెలుగుదేశం నాయకుడు కిట్టు హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి మహాకుంభం సమర్పించారు

## ఏకారమ్మ కొలుపు



ఏర్పేడు, జూలై 24 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన గ్రామ దేవత ఏకారమ్మ ఆలయంలో శుక్రవారం కొలుపును నిర్వహించారు. గ్రామంలో ఏ కార్యక్రమాలు చేపట్టాలన్నా మొదట ఏకారమ్మకు పూజలు జరిపిన తరువాతనే నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో శుక్రవారం నిర్వహించిన కొలుపుకు గుడిమల్లం ఆలయం నుంచి సారెను అందించారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మెన్ బత్తలగిరినాయుడు సారధ్యంలో ఏర్పాటు చేసారు. ఆలయ ఇఓ మునిశేఖర్, సిబ్బంది, ఆలయ వేదపండితులు, గ్రామస్తులు వెంటరాగా సారెను గ్రామంలో ఊరేగింపు జరిపారు. తరువాత గ్రామ పొలిమేరల్లో గ్రామ దేవతకు సమర్పించారు. అక్కడ సారెతో ఆలయ పూజారి ఏకారమ్మను చక్కగా అలంకరించి పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళా భక్తులువిశేష సంఖ్యలో హాజరయ్యారు.

## పరమేశ్వరుని సేవలో అతిధులు



**ఏర్పేడు, జూలై 24 ప్రభాతవార్త:** ఏర్పేడు మండలంలోని ఆనందవల్లి సమేత పరశురామేశ్వరుని సేవలో శుక్రవారం చాణక్య కోఆపరేటివ్‌బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ చాణుక్య కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ఆలయ ప్రధాన ద్వారం వద్ద ఆలయ చైర్మెన్ బత్తలగిరి నాయుడు, ఆలయ ఇఓ మునిశేఖర్ వేదపండితులు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనం చేసుకున్న వారికి ఆలయ చైర్మెన్ గిరినాయుడు ఆలయంలో అమలు చేయనున్న మాస్టర్‌ప్లాన్ గురించి వివరించారు. భాగస్వాములు కావాలన్నారు. వివిధ సేవల గురించి తెలిపారు. తరువాత స్వామి అమ్మవార్ల ప్రసాదాలను అందించారు.

## ప్రభుత్వానికి జనసేన ధన్యవాదాలు



శ్రీకాళహస్తి జూలై 24 ప్రభాతవార్త: గత కొన్నేళ్లుగా మూతబడిన స్కిట్ కాలేజ్ పునఃప్రారంభానికి ఉన్న అడ్డంకులను తొలగించిన రాష్ట్ర ప్రభుత్వానికి జనసేన నాయకులు జయప్రకాష్ ధన్యవాదాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కళాశాల లీజు అగ్రిమెంటుపై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీల నుంచి మినహాయింపు ఇచ్చినందుకు స్కిట్ పూర్వ విద్యార్థుల తరపున, కళాశాల పునఃప్రారంభానికి కృషి చేసిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, మంత్రి నారా లోకేష్‌కు కూడా శ్రీకాళహస్తి జనసేన తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం సత్రవాడ



శ్రీకాళహస్తి జూలై 24 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా పానగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్యకుమారుడు సత్రావాడ ప్రవీణ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా సత్రవాడ ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని అన్నా రు. పిల్లలపై ప్రతిరోజూ శ్రద్ధ చూపించాలని వారి చదువు, క్రమశిక్షణ విషయంలో ఉపాధ్యాయులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకొని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు కోసం చేస్తున్న కృషిని ప్రశంసించారు. పాఠశాలలో మౌలిక వసతులు, బోధనా విధానాల గురించి కూడా చర్చించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు.

# తిరుపతి డివిజన్

## అంతర్జాతీయ ప్రమాణాలతో టేబుల్ టెన్నిస్ అకాడమీ ప్రారంభం

-శిక్షణా కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



**తిరుపతి విద్య, జూలై 24 ప్రభాతవార్త:** నగరంలో టేబుల్ టెన్నిస్ క్రీడాభివృద్ధికి ఊతమిచ్చేలా అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యాధునిక సదుపా యాలు కలిగిన టేబుల్ టెన్నిస్ అకాడమీ ప్రారంభమైంది. సుమారు రూ.15 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ అకాడమీని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. కార్యక్రమంలో నరసింహ యాదవ్, బడి సుధా యాదవ్, రవి నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ, విద్యతో పాటు క్రీడల్లోనూ యువత రాణించేలా అత్యాధునిక శిక్షణా కేంద్రాలు అందుబాటులోకి రావడం శుభపరిణామమన్నారు. తిరుపతి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు వెలుగులోకి రావడానికి ఇటువంటి అకాడమీలు దోహదపడతాయని తెలిపారు. క్రీడలను వృత్తిగా ఎంచుకునే యువతకు ఈ అకాడమీ మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. అకాడమీ వ్యవస్థాపకుడు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, చిన్నప్పటి నుంచే టేబుల్ టెన్నిస్‌లో శిక్షణ పొంది జాతీయ స్థాయిలో ఆడిన అనుభవంతో ఈ అకాడమీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం మూడు బ్యాచ్‌లలో ఫిట్‌నెస్, ఫుట్‌వర్క్, టెక్నిక్స్, గేమ్ ప్లానింగ్, వీడియో విశ్లేషణతో అంతర్జాతీయ ప్రమాణాల కోచింగ్ అందిస్తున్నామని వివరించారు. ఇప్పటికే 20 నుంచి 30 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని, భవిష్యత్తులో తిరుపతి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఛాంపియన్లను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. ఎమ్మెల్యే యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి, దేశానికి గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

## నాణ్యతకు ప్రాధాన్యమే లక్ష్యం!



తిరుపతి విద్య, జూలై 24 ప్రభాతవార్త: నగరంలోని ఎన్జీవోస్ కాలనీలో ఎమ్మెల్యే కార్యాలయం వెనుక నూతనంగా ఏర్పాటు చేసిన ప్రార్థన ఇంటీరియర్ డిజైన్స్ షోరూమ్‌ను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. షోరూమ్‌ను ప్రారంభించిన ఆయన, ఇంటీరియర్ రంగంలో నాణ్యమైన సేవలతో సంస్థ ప్రత్యేక గుర్తింపు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా షోరూమ్‌లో ఏర్పాటు చేసిన మాడ్యులర్ కిచెన్లు, వార్డ్‌రోబ్స్, ఫాల్స్ సీలింగ్ నమూనాలతో పాటు గృహాలు, కార్యాలయాల ఇంటీరియర్ డిజైన్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జనసేన-కూటమి నాయకులు మల్లిశెట్టి లక్ష్మీ ్మ రజిని, పగడాల మురళి, ఆముదాల వెంకటేష్, రేణిగుంట మిథున్, లచ్చి రాయల్, మధు, కిరణ్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు. స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన షోరూమ్‌ను సందర్శించారు.

## ఎస్వీజేసీలో మెగా పేరెంట్-టీచర్స్ సమావేశం



తిరుపతి విద్య, జూలై 24 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో శుక్రవారం మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్ (పీటీఎం)-4.0ను కళాశాల ప్రిన్సి పాల్ సి. ప్రకాష్‌బాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల విద్యా పురోగతి, క్రమశిక్షణ, కళాశాల విద్యా ప్రమాణాలు, తల్లిదండ్రుల భాగస్వామ్యంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ప్రిన్సిపాల్ సి. ప్రకాష్‌బాబు మాట్లాడు తూ, కళాశాల విద్యాఫలితాలు, ప్రత్యేక కార్యక్రమాలు, క్రమశిక్షణ, సమయ పాలన, కళాశాల నిబంధనలపై తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి డా. వై. మల్లిఖార్జునరావు మాట్లాడుతూ, కుటుంబం, అధ్యాపకులు కలిసి పనిచేస్తేనే విద్యార్థి వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందన్నారు. విశిష్ట అతిథి డా. పి. లోకనాథ్ మందాడి మాట్లాడుతూ, మొబైల్ ఫోన్, సామాజిక మాధ్యమాల వినియోగంపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. డిప్యూటీ వార్డెన్ డా. ఎం. ప్రసాద్‌రావు మాట్లాడుతూ, మార్కుల కంటే నిజాయితీ, క్రమశిక్షణ, మంచి నడవడికే జీవితంలో ఉన్నత స్థానాలకు తీసుకెళ్తాయని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథి డా. కె. రాజేష్ మాట్లాడుతూ, విద్యార్థి విజయంలో తల్లిదండ్రుల త్యాగం, ఉపాధ్యాయుల శ్రమ, విద్యార్థి కృషి సమానంగా ఉంటాయని, ఈ మూడు కలిసినప్పుడే సమాజానికి ఉత్తమ పౌరులు తయారవుతారని తెలిపారు

## పక్షుల కిలకిలరావాలతో ఒత్తిడికి చెక్

-ఎస్పీ డబ్ల్యు కళాశాలలో ఆర్నిథెరపీపై అవగాహన సదస్సు



**తిరుపతి విద్యజూలై 24 ప్రభాత వార్త:** పక్షుల సహజ ధ్వనులు మానసిక ఒత్తిడిని తగ్గించి ఏకాగ్రతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ప్రముఖ ఆర్నిథాలజిస్ట్ కే. కార్తీక్ సాయి అన్నారు. శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఎకో క్లబ్, యూత్ రెడ్ క్రాస్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో పక్షుల ప్రాముఖ్యత-ఆర్నిథెరపీ ద్వారా ఒత్తిడి నివారణ అంశంపై శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. నారాయణమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పోటీ ప్రపంచంలో విద్యార్థులు అనవసర ఒత్తిడికి లోనుకాకుండా సమయపాలన, సానుకూల దృక్పథం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ముఖ్య అతిథి కే. కార్తీక్ సాయి మాట్లాడుతూ, పక్షుల వైవిధ్యం, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్ర, పక్షుల కిలకిలరావాల ద్వారా లభించే సౌండ్ థెరపీ ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎకో క్లబ్ కన్వీనర్ డా. బి. జ్యోతి, సభ్యులు డా. పి. జ్ఞాన ప్రసూన, డా. వై. యామిని, డా. ఎన్. వరప్రసూన, యూత్ రెడ్ క్రాస్ కన్వీనర్ డా. వి. లక్షి ్మ, సభ్యులు డా. జి. లక్షి ్మ సంధ్య, అధ్యాపకులు డా. కే. సాయి కుమారి, డా. కే. విజయ కుమారి, డా. టి.కె. పద్మజ, డా. ఎ. శిరీష, డా. జి. వాణి ప్రశాంతి, డా. కే. కుసుమతో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

## స్పాట్ అడ్మిషన్లను పరిశీలించిన...టీటీడీ డీఈఓ



**తిరుపతి విద్య, జూలై 24 ప్రభాతవార్త:** ఎస్పీ డబ్ల్యు జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను టీటీడీ డీఈఓ డి.పణికుమార్ నాయుడు శుక్రవారం పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. భువనేశ్వరితో కలిసి కౌన్సెలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అడ్మిషన్ల కోసం వచ్చిన విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ, రాష్ట్రంలో అత్యధిక డిమాండ్ ఉన్న జూనియర్ కళాశాలల్లో శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల ఒకటిగా నిలిచిందన్నారు. రెగ్యులర్ కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన సీట్ల భర్తీ కోసం నిర్వహిస్తున్న స్పాట్ అడ్మిషన్లను సద్వినియోగం చేసుకుని విద్యార్థినులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. టీటీడీ కల్పిస్తున్న విద్యా, వసతి సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యలో ప్రతిభ కనబరచాలని తెలిపారు. నాణ్యమైన విద్య, సురక్షి త వాతావరణం, క్రమశిక్షణతో కూడిన నిర్వహణ కారణంగానే తమ పిల్లలను ఇక్కడ చేర్పిస్తున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. టీటీడీ జేఈఓ, కార్యనిర్వహణాధికారితో చర్చించి హాస్టల్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తానని డీఈఓ పణికుమార్ నాయుడు తెలిపారు.

## పెంపుడు పిల్లికి అరుదైన శస్త్రచికిత్స విజయవంతం



తిరుపతి విద్య, జూలై 24 ప్రభాత వార్త: తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు, పదేపదే వాంతుల ప్రయత్నం, కడుపునొప్పితో బాధపడుతున్న ఓ పెంపుడు పిల్లికి తిరుపతి వెటర్నరీ కళాశాల వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్‌లో అరుదైన శస్త్రచికిత్స విజ యవంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం పిల్లి పూర్తిగా కోలుకుని సాధారణ స్థితికి చేరుకోవడంతో వైద్యులు ఊపిరి పీల్చుకున్నారు. వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్ విభాగాధిపతి ఆచార్యులు డా. ఎస్. భారతి మాట్లాడుతూ, సమగ్ర పరీక్షలు, కాంట్రాస్ట్ రేడియోగ్రఫీ అనంతరం డయాఫ్రం చీలిపోవడంతో కడుపు పూర్తిగా ఛాతీ గుహలోకి జారిపోయినట్లు గుర్తించి డయాఫ్రాగ్మాటిక్ హెర్నియాగా నిర్ధారించినట్లు తెలిపారు. ఈ పరిస్థితి గుండె, ఊపిరితిత్తుల పనితీరును తీవ్రంగా ప్రభావితం చేస్తుందని వివరించారు. శస్త్రచికిత్స నిపుణులు డా. ఎం. రఘునాథ్ నేతృత్వంలోని వైద్య బృందం ఇన్‌హలేషన్ అనస్థీషియా కింద అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి, ఛాతీ గుహలోకి జారిన కడుపును తిరిగి ఉదర భాగంలో అమర్చారు. ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని కళాశాల అసోసియేట్ డీన్ డా. పి. జగపతిరామయ్య